సాక్షి ఒడిశా
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,82,426

- భువనేశ్వర్/పూరీ



సిబ్బంది పనితీరు భేష్

తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం బలుగాంవ్, పలాస రైల్వే సెక్షన్‌లో సిబ్బంది పనితీరుపై జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ సంతృప్తి వ్యక్తం చేశారు.

- 8లో.

అదుపుతప్పిన ప్రైవేటు బస్సు



గజపతి జిల్లా రాయఘడ సమితి మర్లబ ఘాటీ వద్ద మంగళవారం సాయంత్రం ఒక ప్రైవేటు బస్సు అదుపుతప్పి కొండను ఢీకొంది.

- 8లో.

న్యూస్‌రీల్

మధుసూదన్ దాస్ సేవలు మరువలేనివి



మధుసూదన్ దాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: ఉత్కళ రాష్ట్రం అవతరణ, ఒడియా భాష, సంస్కృతిల పరిరక్షణ, వ్యాప్తికి దివంగత ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ చేసిన సేవలు మరువలేనివని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. మంగళవారం ఉత్కళ గౌరవ్ వర్ధంతి పురస్కరించుకొని శాసన సభ ప్రాంగణంలో ఆయన విగ్రహానికి గవర్నర్ కంభంపాటి హరిబాబు, సీఎం మోహన్‌చరణ్ మాఝిలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ కాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను మంగళవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కె.సూర్యనారాయణ శర్మ, డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ ఏడాది తమ క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

నకిలీ విదేశీ మద్యం స్వాధీనం



అరెస్టైన నిందితులు, పట్టుబడిన మద్యం చూపిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో ఎక్సైజ్ అధికారులు సోమవారం రాత్రి ఒక దుకాణంపై దాడులు చేసి నకిలీ విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టైనవారు బీహార్ రాష్ట్రానికి చెందిన అజిత్ కుమార్, అభిమన్యు కుమార్‌లుగా గుర్తించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ కంభుపాణి సింధూర్ తెలిపిన వివరాల మేరకు.. గత కొన్నేళ్లుగా చంద్రపూర్‌లో నకిలీ విదేశీ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయనే సమాచారం సోమవారం రాత్రి ఆకస్మికంగా దాడులు చేపట్టారు. దాడుల్లో నకిలీ విదేశీ మద్యం 102 లీటర్లు, మరో 117 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమంగా విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థిపై కత్తితో దాడి



కత్తిపోటుకు గురైన విద్యార్థి రామచంద్ర మాఢి

జయపురం: స్థానిక విక్రమ దేవ్ వర్సిటీ విద్యార్థిపై కొంతమంది యువకులు కత్తితో దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం సాయంత్రం యూనివర్సిటీ విద్యార్థులు సరస్వతీ విగ్రహాన్ని కెనాల్ నదిలో నిమజ్జనం చేసి తిరిగి వర్సిటీకి వస్తుండగా, విక్రమ క్రీడా మైదానంలో కొంతమంది దుండగులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్ర మాఢి అనే విద్యార్థి వద్ద సెల్‌ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించారు. దీంతో విద్యార్థులు దుండగులను ఎదిరించగా ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఒక దుండగుడు కత్తితో విద్యార్థి రామచంద్ర మాఢిని పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే స్థానిక జిల్లాకేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం కొరాపుట్ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఘటనపై వర్సిటీ రిజిస్ట్రార్ రంజన్ ప్రధాన్ జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విద్యార్థిపై దాడితో వర్సిటీలో కలకలం రేగింది.

వాట్ నెక్స్ట్..!

- సంస్థాగతంగా బలోపేతంపై పార్టీల కసరత్తు
- మధ్యంతర ఎన్నికలపై ఆశలు
- పార్టీల్లో నియామకాలపై ఉత్సాహం



ప్రతాప్ కేసరి దేవ్ అధ్యక్షతన బీజేడీ నాయకుల సమావేశం

భువనేశ్వర్:

రాష్ట్ర రాజకీయ శిబిరాల్లో సరికొత్త వాతావరణం నెలకొని ఉంది. రాజకీయ పార్టీలు సంస్థాగత సంస్కరణలు చేపడుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తొలిసారిగా పాలన పగ్గాలు చేపట్టింది. అంతకుముందు దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు బిజూ జనతా దళ్ పాలించింది. ఈ సుదీర్ఘ పాలన ఫలితాలు జాతీయ స్థాయిలో రాష్ట్ర ఖ్యాతిని తళుక్కుమనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా తొలిసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ ప్రజాకర్షక పథకాలు రద్దు లేదా పేర్ల మార్పిడికి నడుం బిగించింది. నీతి అయోగ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనియాడడంతో అధికార పక్షం డోలాయమాన స్థితిలో పడిపోయింది.

మధ్యంతర ఎన్నికల ఊహలు

2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై తలెత్తిన పలు అనుమానాలు, సందేహాల నేపథ్యంలో ఏ క్షణంలోనైనా ప్రభుత్వాలు కుప్పకూలే అవకాశం లేకపోలేదనే విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలు 2027 నాటికి మధ్యంతర ఎన్నికలు తథ్యమనే ఊహతో సంస్థాగత ఎన్నికల సంస్కరణలకు నడుం బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఊహాగానాలతో మూడు ప్రధాన పార్టీలు కొత్త టీమ్‌ల ఏర్పాటుపై అత్యంత ఉత్సాహం ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీల్లో అంతః కలహాలు తొలగించేందుకు తలమునకలై ఉన్నాయి. అడపాదడపా పార్టీల అగ్రశ్రేణి జాతీయ నాయకులు రాష్ట్ర పర్యటనకు విచ్చేసి సంస్థాగత వ్యవహారాలను సమీక్షిస్తున్నారు. అట్టడుగు స్థాయి నుంచి కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారు.

సంస్థాగత ఎన్నికలు

సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్ తలమునకలై ఉన్నాయి. ఆకస్మిక రాజకీయ పరిణామాలను సమయస్ఫూర్తితో సానుకూలంగా మలచుకోగలిగే సమర్థవంతమైన జట్లు సిద్ధం చేయడంలో పార్టీల అగ్రశ్రేణి నాయకులు కసరత్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్ పార్టీ అన్ని శాఖలను రద్దు చేశారు. రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల ప్రక్రియను అట్టడుగు స్థాయి నుంచి ముమ్మరం చేశారు. సంస్థాగత వ్యవస్థని అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం చేసే దిశలో బీజేడీ అడుగులు వేస్తోంది. ఈ వ్యవహారాన్ని పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. నిబంధనల ప్రకారం త్రైవార్షిక సంస్థాగత ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మహిళా, యువజన, విద్యార్థులు, కార్మిక, న్యాయశాఖ వంటి ముందంజ సంస్థలకు పునరుజ్జీవం పోసేందుకు అధిష్టానం అహర్నిశలు కృషి చేస్తోంది. పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ పురస్కరించుకుని సీనియర్ నాయకుడు ప్రతాప్ కేసరి దేవ్‌ని రిటర్నింగ్ అధికారిగా నియమించారు. ఆయన అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణను సీనియర్ నేతలకు వివరించారు. అలాగే అధికార భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభించింది. ఇప్పటివరకు 23 జిల్లాల అధ్యక్షులను ప్రకటించింది. మిగిలిన 14 సంస్థాగత జిల్లాల్లో జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. 14 జిల్లాల్లో అధ్యక్ష పదవి రేసులో పలువురు అభ్యర్థులు ఉన్నారు. అదేవిధంగా గత 7 నెలలుగా కాంగ్రెస్ శిబిరంలో అధినేత ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. ఢిల్లీ ఎన్నికల తర్వాత ఒడిశా పీసీసీ కొత్త అధ్యక్ష పదవికి అభ్యర్థి ఖరారు అవుతారని ఆ పార్టీ సీనియర్ నేత సంతోష్ సింగ్ సలూజా తెలిపారు. ఆ తర్వాత పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను క్రమబద్ధీకరించి జిల్లాల వారీగా సంస్థను పునర్వ్యవస్థీకరించడం జరుగుతుందన్నారు.

ఆశల తీరంలో కాంగ్రెస్

దేశంలో అక్కడక్కడ విజయకేతనం ఎగురవేస్తున్నందున రాష్ట్రంలో కాంగ్రెస్‌కు శుభ ఘడియలు అత్యంత చేరువలో ఉన్నాయని పగటి కలల్లో తేలియాడుతోంది. ఈసారి ప్రభుత్వం పూర్తి కాలం పనిచేసే అవకాశాలు లేవని నమ్ముతోంది. మధ్యంతర ఎన్నికలు తథ్యమని, ఊహించిన విధంగా అన్ని అనుకూలిస్తే అధికారంలోకి వస్తామని ఆశల్లో మునిగి తేలుతోంది.

బీజేడీ అంతర్మథనం

బీజేడీ హయాంలో చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యకలాపాలను జాతీయ స్థాయి సంస్థలు కీర్తిస్తున్నాయి. సమయోచిత సందర్భాల్లో ప్రజాదరణ ఏమాత్రం చెక్కు చెదరనట్లు రుజువు అవుతోంది. ఇన్ని అనుకూల పరిస్థితుల్లో ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ పరాజయం పాలవ్వడంతో అంతు చిక్కని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది.

తీరం.. జనసంద్రం



పుణ్య స్నానాలాచరిస్తున్న భక్తులు



చంద్రభాగ తీరంలో మంగళ హారతినిస్తున్న దృశ్యం

- భక్తిశ్రద్ధలతో రథ సప్తమి పూజలు



వేకువజామున జనసంద్రంగా మారిన చంద్రభాగ తీరం

భువనేశ్వర్: పవిత్ర మాఘ సప్తమి పురస్కరించుకుని పూరీ జిల్లా కోణార్క్ చంద్రభాగ తీరం జనసంద్రంగా మారింది. రథ సప్తమి సందర్భంగా ఈ తీరంలో స్నానమాచరించడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలి రావడంతో మంగళవారం ఈ తీరం కిటకిటలాడింది. సంప్రదాయం ప్రకారం మాధిపూర్‌లోని త్రివేణీశ్వరుడు, కురుజాంగో దక్షిణేశ్వరుడు, శాంతాపూర్‌లోని ఐషనేశ్వరుని ఉత్సవమూర్తులు ఊరేగింపుగా ఈ తీరానికి తరలి వచ్చాయి. ఈ ముగ్గురు దేవుళ్ల తొలుత చంద్రభాగలో స్నానమాచరించిన అనంతరం, సాధారణ భక్తజనం పుణ్య స్నానాలు చేశారు. స్నానం అనంతరం కోణార్క్ దేవాలయం పరిసరాల్లో నవగ్రహ ఆరాధన చేసి భక్తులు తరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూరీ జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. కోణార్క్, చంద్రభాగ తీర ప్రాంతాల్లో 6 మంది అదనపు పోలీసు సూపరింటెండెంట్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో 33 ప్లాటూన్ల పోలీసు దళాలను మోహరించారు.



కిటకిటలాడుతున్న చంద్రభాగ తీరం

మిషన్ శక్తి కార్యకర్తల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మిషన్ శక్తి కార్యకర్తలు



కలెక్టర్ బిజయకుమార్ దాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఏడు సమితి కేంద్రాల్లో పనిచేస్తున్న మిషన్ శక్తి కార్యకర్తలు కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. గత ఐదు నెలలుగా వారికి రావాల్సిన కమీషన్ రావడం లేదని, అలాగే ఉన్న సిబ్బందిని తొలగించి రీ కన్‌స్ట్రక్షన్ పేరుతో కొత్త సిబ్బందిని నియమించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడంతో నిరసన తెలిపారు. కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్ శక్తి విభాగంలో పనిచేస్తున్న తమను విధుల నుంచి తొలగించవద్దని కోరారు. వారికి ఇచ్చిన స్కూటీల రుణాలు రద్దు చేయాలని, సర్వీసులు 65 ఏళ్లకు పొడిగించాలని విన్నవించారు. దీంతో కలెక్టర్ బిజయకుమార్ దాస్ వచ్చి మిషన్ శక్తి వర్కర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ శక్తి బీఎల్ఎఫ్, సీఎల్ఎఫ్, ఈసీ మహాసంఘ కార్యదర్శి అనితా దాస్, అధ్యక్షురాలు కాంచన కుమారి నాయక్ నుంచి వినతిపత్రం తీసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆందోళనలో అఖిల ఒడిశా జీవికా మిషన్ ఈసీ మహాసంఘం నాయకురాలు సమితా సామల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో పట్టుబడిన మహిళ



అరెస్టైన మహిళ

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసుస్టేషన్ పరిధి సోరలుకొండ గ్రామంలో నకిలీ బంగారంతో మహిళ పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. కొన్ని రోజులుగా గ్రామాల్లోకి ఛత్తీస్‌గఢ్ నుంచి ఇద్దరు మహిళలు వచ్చి బంగారు నగలు మెరుగుపెడతానని చెప్పి నకిలీ బంగారాన్ని ఇస్తున్నారు. ఇది తెలియని సింగే సోడీ అనే మహిళ తన బంగార గొలుసును ఇచ్చి అందులో మణులు గుచ్చి ఇవ్వమని కోరింది. దీంతో అలాంటిదే మరో గొలుసు ఇచ్చి ఇద్దరు మహిళలు పరారయ్యారు. అయితే అది నకిలీ బంగారం అని గ్రహించిన సింగే సోడి వెంటనే బలిమెల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఐఐసి దీరాజ్ పట్నాయక్ కేసు నమోదు చేసి, కుడుములగూడ ప్రాంతంలో ఒకరిని అరెస్టు చేశారు. మరో మహిళ పారిపోవడంతో ఆమె కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన మహిళను విచారించగా ఛత్తీస్‌గఢ్‌లోని బాగడీ గ్రామానికి చెందిన లక్ష్మీబాయి గిరిగా తెలిసింది. ఆమెను కోర్టుకు తరలిస్తామని పోలీసులు వెల్లడించారు.

విద్యార్థి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న విద్యార్థి రిగెన్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గంపకొండ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి రిగెన్ మడ్కమి పాఠశాల వెనుక ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాల హాస్టల్‌లో సోమవారం రాత్రి 9 గంటల వరకు తోటి విద్యార్థులతో కలిసి రిగెన్ సరదాగా గడిపాడు. అనంతరం భోజనానికి పిలవగా వస్తానని చెప్పాడు. అయితే రాత్రి 10 గంటలైనా భోజనానికి రాకపోవడంతో వేరే ఏదైనా రూమ్‌లో పడుకున్నాడు అనుకున్నారు. 10.30 గంటలకు అటువైపు వెళ్లిన సిబ్బందికి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే కలిమెల పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ చంద్రకాంత్ తండి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కలిమెల సమితి కాలిబెడ గ్రామం నుంచి తల్లిదండ్రులు ముక మడ్కమి, సుభాషిణి మడ్కమిలు వచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. తమబిడ్డ ఆత్మహత్య చేసుకోడు అని ఆరోపించారు. పాఠశాలలో సరిగా సౌకర్యాలు లేవు అని ఫిర్యాదు చేశారు. అయితే క్లూస్ టీమ్ వచ్చి, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతి గల కారణాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కలెక్టర్‌గా నవీన్‌చంద్ర నాయక్



రాయగడ: జిల్లా అదనపు కలెక్టర్‌గా నవీన్ చంద్ర నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఈ బాధ్యతలను ఏడీఎంగా వ్యవహరించే నిహారి రంజన్ కుహరో నిర్వహిస్తుండేవారు. నాయక్ బాధ్యతలు చేపట్టడంతో ఉద్యోగులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. నవీన్‌చంద్ర ఇదివరకు నవరంగపూర్ జిల్లాలో ఏడీఎంగా వ్యవహరించేవారు.

కార్మికుల పాత్ర బృహత్తరమైనది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

జయపురం: దేశ నిర్మాణ రంగంలో కార్మికుల పాత్ర బృహత్తరమైనదని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ టౌన్ హాల్‌లో జిల్లా పాలనా అధికారులు, కార్మిక విభాగ అధికారులు సంయుక్తంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్మిక సహాయ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమశక్తి లేనిదే దేశ ప్రగతి శూన్యమన్నారు. కార్మికవర్గం ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. దీనికోసం ప్రభుత్వం తగు పథకాలు అమలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలితాలు వారికి అందేలా చూడాలని కోరారు. అనంతరం 125 మంది నిర్మాణ కార్మికులకు వివిధ పథకాల్లో భాగంగా రూ.72,54,200ల ఆర్థిక సాయంతో, కొత్తగా ఎంపికైన మరో 250 మంది నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. అలాగే మరణించిన 11 మంది అసంఘటిత కార్మికుల కుటుంబాలకు రూ.18 లక్షలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కోట్‌పాడ్ ఎమ్మెల్యే ప్రతినిధి రామకృష్ణ భొత్ర, జిల్లా పరిషత్-2 జోన్ సభ్యురాలు మంజుల ఘాసి, జోన్-3 సభ్యుడు నృసింహానాథ్ శతపతి, సమితి సంక్షేమ అధికారి కుమారి సోనాలి నాయిక్, కార్మిక అధికారి బృందావన శెట్టి, కార్మిక విభాగ సహాయ అధికారి నరేంద్ర నాయిక తదితరులు పాల్గొన్నారు.

మో బస్సు ఢీకొని బాలిక మృతి



ఘటనా స్థలంలో ఉద్రిక్తత



మో బస్సు రవాణా అడ్డుకున్న దృశ్యం

భువనేశ్వర్: స్థానిక నందకానన్ సమీప రఘునాథ్‌పూర్ ప్రాంతంలో మో బస్సు ఢీకొని బాలిక మృతి చెందింది. దీంతో ఘటనా స్థలంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు ఆందోళనకు దిగి రోడ్డును దిగ్బంధించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం తక్షణమే ఘటనా స్థలంలో పోలీసు బలగాలను మోహరించారు. బాలిక తన సైకిలుపై రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వస్తున్న మో బస్సు ఆమెను ఢీకొట్టడంతో బాధితురాలు అక్కడికక్కడే మరణించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటన తర్వాత స్థానికులు నిరసన చేపట్టారు. ఆ మార్గం గుండా రవాణా అవుతున్న మో బస్సులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన రహదారిపై అడ్డంగా వెదురు బొంగుని వేసి నందన కానన్, పటియా రహదారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు.

క్లుప్తంగా

17 నుంచి వాసుదేవ బ్రహ్మోత్సవాలు



మందస: మండల కేంద్రం మందసలో వాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామివారి కల్యాణం, చక్రతీర్థం, తెప్పోత్సవం, రథోత్సవంతో పాటు అనేక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా జరుగుతాయని, పరిసర ప్రాంతాలతో పాటు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవోదయ హాల్‌టికెట్లు సిద్ధం

సరుబుజ్జిలి : వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 9, 11 తరగతుల ఎంపిక పరీక్ష హాల్ టికెట్లు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 8న 9వ తరగతికి సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయంలో, 11వ తరగతికి సంబంధించి సరుబుజ్జిలి వద్ద వెంకటసాయిపబ్లిక్ స్కూల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్ : హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్స్ తరఫున పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ చదివిన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకెండ్ ఫ్లోర్‌లో బ్యూటీ థెరపిస్ట్, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని, ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వారు అర్హులని, పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో గానీ, 7680945357, 9121999654 నంబర్లను గానీ సంప్రదించాలని కోరారు.

కమ్మసిగడాంలో కల్యాణ రాట



పెళ్లిరాట వేస్తున్న మహిళలు

రణస్థలం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా కొలిచే కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి పెళ్లిరాట కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు, మహిళలు మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, అధ్యక్షుడు వి.వి.ఎస్.వి.ప్రసాద్‌లు మాట్లాడుతూ రథసప్తమి నాడు కల్యాణ రాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. మహాలక్ష్మి తల్లి, గురప్పదొరల కల్యాణం ఈ నెల 7వ తేదీ రాత్రి 9.25 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, కమిటీ సభ్యులు రాజారవిచంద్ర తేజ, రాజశేఖర్, మన్నె లక్ష్మీ ప్రసాద్, సురేష్ కుమార్, మురళీధర్, రాయుడు, మన్నె కృష్ణానందం, మౌళి, రఘునాథ్, తాతీయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే విజయం ఖాయం



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

టెక్కలి: లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే కచ్చితంగా విజయం సొంతమవుతుందని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సీహెచ్.సుధాకర్, కార్యదర్శి డి.వి.రమణ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్నో విజన్ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇన్నోవేట్ నా, కోడ్ వార్, డీబగ్ చాలెంజ్, మైండ్ మాస్టర్ వంటి పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలైన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర విద్యార్థులకు 50 వేల రూపాయల నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ వై.రమేష్, డీన్ యు.డి.ప్రసన్న, కో–కన్వీనర్ టి.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభాత సూర్యుడికి ప్రణామం

- భక్తిశ్రద్ధలతో రథ సప్తమి పూజలు

రథ సప్తమి పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సూర్య భగవానుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇళ్లు, ఆలయాల్లో ఆదిత్యుడికి పూజలు చేశారు. వేకువ జాము నుంచే సముద్రతీరాలకు వెళ్లి స్నానాలాచరించారు. అలాగే సూర్య నమస్కారాలు చేసి ఆరోగ్యం కలిగించాలని వేడుకున్నారు. సంప్రదాయబద్ధంగా చిక్కుడు కాయలతో రథాన్ని తయారు చేసి, పిడకలపై పాలు పొంగించి భానుడికి సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురంలో పూజలు చేస్తున్న మహిళలు



పర్లాకిమిడి: శ్రీరామలింగేశ్వర మందిరంలో పూజలందుకుంటున్న సూర్య భగవానుడు



రాయగడ: ఆదిత్యుని దర్శనానికి వేచి ఉన్న భక్తులు



రాయగడ: ఇళ్లలో భాస్కరుడికి పూజలు



రాయగడ: పూజలందుకుంటున్న సూర్య భగవానుడు

యువతిని వేధిస్తున్న యువకుడు అరెస్టు



అరెస్టైన సంజీవ్ తరాయి

మల్కన్‌గిరి: యువతి ప్రైవేటు ఫొటోలను వైరల్ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2019లో మొయిర్ బంజ్ జిల్లాకు చెందిన సంజీవ్ తరాయి అనే ఇంజినీరింగ్ విద్యార్థి, మల్కన్‌గిరికి చెందిన 16 ఏళ్ల అమ్మాయితో ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకున్నాడు. కొన్నేళ్లకు వీరిమధ్య సాన్నిహిత్యం పెరిగింది. దీంతో 2020లో సంజీవ్ మల్కన్‌గిరి వచ్చి యువతిని వివాహం చేసుకుంటానని చెప్పి మరింత దగ్గరయ్యాడు. ఈ సందర్భంగా వీడియోలు, ఫొటోలు తీసుకొని తన వద్ద ఉంచుకున్నాడు. అనంతరం 2021లో తన వద్ద ఉన్న ఫొటోలను అమ్మాయికి పంపించి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. భయంతో ఆ అబ్బాయిని ఫేస్‌బుక్, వాట్సాప్‌లో బ్లాక్ చేసింది. అయితే కోపంతో సంజీవ్ వేరే ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేసి ఆ ఫొటోలు, వీడియోలు పోస్టు చేశాడు. అలాగే ఒక నకిలీ యూట్యూబ్ ఛానల్‌లో కూడా వైరల్ చేశాడు. దీంతో యువతి తండ్రి మల్కన్‌గిరి ఎస్పీ వినోద్ పటేల్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్పీ వినోద్ ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బలేశ్వర్‌లో ఉన్న యువకుడిని అరెస్టు చేశారు. కేసు నమోద్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు.

సిబ్బంది పనితీరు భేష్



రైలు పట్టాల తనిఖీలో జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

- తూర్పు కోస్తా రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం బలుగాంవ్, పలాస రైల్వే సెక్షన్‌లో సిబ్బంది పనితీరుపై జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సెక్షన్‌లో భద్రతా చర్యలు, రైళ్ల రవాణా నిర్వహణ, ప్రయాణికుల సౌకర్యాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద స్టేషన్ పునరాభివృద్ధి పనులపై దృష్టి సారించారు. గార్డులు, లోకో పైలెట్ల విరామం కోసం కల్పించే రన్నింగ్ రూమ్ సదుపాయాల నిర్వహణ తీరుని సమీక్షించారు. ఇక్కడ సిబ్బందికి ఆహార సేవల పరిశుభ్రత, నాణ్యతని క్షుణ్ణంగా పరిశీలించారు. పలాస స్టేషన్‌లోని రైల్వే కాలనీ, సిబ్బంది రన్నింగ్ రూం, రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ (ఆర్‌ఆర్‌ఐ) భవనాన్ని పరిశీలించారు. రన్నింగ్ రూమ్ సిబ్బందికి వారి అత్యుత్తమ నిర్వహణ, పరిశుభ్రతకు నగదు అవార్డులను అందజేసి ఉత్సాహపరిచారు. జనరల్ మేనేజర్ తనిఖీ కార్యక్రమంలో ఖుర్దా రోడ్ మండల రైల్వే అధికారి హెచ్.ఎస్.బాజ్వాతో పాటు జోనల్ ప్రధాన కార్యాలయం, ఖుర్దా రోడ్ రైల్వే మండలం సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.



సిబ్బంది విరామ కేంద్రాల్లో నాణ్యతపై సమీక్ష



రన్నింగ్ రూమ్‌లో ఆహార నాణ్యత పరిశీలిస్తున్న దృశ్యం



నగదు పురస్కారం అందుకున్న రమేష్

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతి



ఘటన స్థలంలో జోడియా మృతదేహం



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

రాయగడ: ట్రాక్టర్ అదుపుతప్పి వృద్ధుడిని ఢీకొనడంతో మృతి చెందిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి మైకంచ్ పంచాయతీ కంచుగుమ్మ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి జిరిగాం గ్రామానికి చెందిన పూర్తి జొడియా(62)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం మధ్యాహ్నం జొడియా జిరిగాం నుంచి పనిమీద నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో మెటల్ లోడ్‌తో వస్తున్న ఒక ట్రాక్టర్ అదుపుతప్పి వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో జొడియాకు తీవ్రగాయాలు అవ్వడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయితే తీవ్రగాయాలతో ఉన్న జొడియా మార్గమధ్యలో మృతి చెందాడు.

అదుపుతప్పిన ప్రైవేటు బస్సు

- 20 మందికి గాయాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ సమితి మర్లబ ఘాటీ వద్ద మంగళవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో ఒక ప్రైవేటు బస్సు అదుపుతప్పి కొండను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఘటన స్థలానికి రాయఘడ పోలీసులు చేరుకొని క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స కేంద్రంలో చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం సాయంత్రం 5 గంటలకు బరంపురం నుంచి బయల్దేరిన విక్రాంత్ బస్సు, ఆర్.ఉదయగిరిలో కొంతసేపు ఆపి పర్లాకిమిడికి బయలుదేరింది. ఈ ప్రైవేటు బస్సు మర్లబ ఘాటి దిగుతున్నప్పుడు అదుపుతప్పడంతో కొండను ఢీకొంది. దీంతో బస్సు ముందరి భాగం నుజ్జునుజ్జయ్యింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు రాయఘడ పోలీసు స్టేషన్ అధికారి రీనా రాణి సాహు తెలియజేశారు.



దెబ్బతిన్న బస్సు ముందరి భాగం

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



శ్రీలక్ష్మీ పూజలు చేస్తున్న మహిళలు



కల్యాణ మహోత్సవంలో స్వామివారు

జయపురం: పట్టణంలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వర స్వామివారి ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆలయ పరిపాలన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకలను తిలకించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. భక్తుల దర్శనార్థం వేంకటేశ్వరస్వామి, పద్మావతి, ఆండాలమ్మ, లక్ష్మీ దేవతలను ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. స్వామివారి కల్యాణ మహోత్సవం, ధ్వజారోహణ, వసంతోత్సవ కార్యక్రమం, శ్రీలక్ష్మీదేవి కుంకుమార్చన తదితర కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మంగళవారం రథ సప్తమి పురస్కరించుకొని సామూహిక శ్రీలక్ష్మీ కుంకుమార్చన లక్ష్మీ హోమం నిర్వహించారు.



భక్తులకు దర్శనమిస్తున్న వైభవ వేంకటేశ్వరస్వామివారు



భక్తులకు దర్శనమిస్తున్న పద్మావతి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో ఆండాలమ్మ అమ్మవారు

గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి 5 కి.మీ దూరంలో ఉన్న చంపఖారి గ్రామం వద్ద సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో జయపురంవైపు ఒక ఆటో అతివేగంగా వెళ్తుండగా ఆపి తనిఖీలు నిర్వహించారు. అయితే ఆటోలో 5 బస్తాల గంజాయిని గుర్తించి వెంటనే ఆటోలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నిందితుడిని విచారించగా గంజాయిని జయపురం మీదుగా ఛత్తీస్‌గఢ్ తరలిస్తున్నట్లు తెలిపాడు. నిందితుడు మల్కన్‌గిరి టౌన్‌లోని రిక్లమేషన్ కాలనీకి చెందిన గౌరాంగ్ మండాల్‌గా గుర్తించారు. పట్టుబడిన గంజాయిని తూకం వేయగా 100 కేజీలు ఉందని, దీని విలువ రూ.5 లక్షలు ఉంటుందని ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు .

యువకుడికి తప్పిన ప్రాణాపాయం



ప్రాణాలతో బయటపడిన సోమరెడ్డి మణి

వజ్రపుకొత్తూరు రూరల్: రథసప్తమి సందర్భంగా సముద్రంలో ఓ యువ భక్తుడు పుణ్యస్నానం చేస్తుండగా అపశృతి చోటు చేసుకున్న ఘటన అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందిన సోమరెడ్డి మణి వేకువజామున సముద్రంలో పుణ్యస్నానాలకు దిగి అలల తాకిడికి గల్లంతయ్యాడు. అదే సమయంలో తీరంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న శ్రీరామ సేవ సంఘం, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు వెంటనే అప్రమత్తమై కాపాడారు. అపస్మారక స్థితిలో ఉన్న మణికి ప్రథమ చికిత్స అందించి 108 అంబులెన్సులో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుడి ప్రాణాలను కాపాడిన మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కాస చలపతి, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాదరావు, కార్యదర్శి ఆర్జాల ఈశ్వరరావు, సభ్యులు ఎల్.నాయుడు, నారాయణ, మహేష్, బాలకృష్ణ, అనిల్‌ను పలువురు అభినందించారు.

కమ్మసిగడాంలో కల్యాణ రాట



పెళ్లిరాట వేస్తున్న మహిళలు

రణస్థలం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా కొలిచే కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి పెళ్లిరాట కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు, మహిళలు మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, అధ్యక్షుడు వి.వి.ఎస్.వి.ప్రసాద్‌లు మాట్లాడుతూ రథసప్తమి నాడు కల్యాణ రాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. మహాలక్ష్మి తల్లి, గురప్పదొరల కల్యాణం ఈ నెల 7వ తేదీ రాత్రి 9.25 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, కమిటీ సభ్యులు రాజారవిచంద్ర తేజ, రాజశేఖర్, మన్నె లక్ష్మీ ప్రసాద్, సురేష్ కుమార్, మురళీధర్, రాయుడు, మన్నె కృష్ణానందం, మౌళి, రఘునాథ్, తాతీయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- చౌటుప్పల్‌లో ఘటన
- బైక్‌పై వెళ్తుండగా దుర్ఘటన
- మృతుడు ఇచ్ఛాపురం వాసి

చౌటుప్పల్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం అందెపల్లి గ్రామానికి చెందిన ఇసరు ఉదయ్(25)తో పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాగాడి రాజేష్, మందడుగు ఉపేందర్ చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామ పరిధిలోని దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. అదే కంపెనీకి చెందిన హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు ముగ్గురు కలిసి బైక్‌పై మంగళవారం యాదగిరిగుట్టకు వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి హాస్టల్‌కు వెళ్తుండగా లింగోజిగూడెం గ్రామం వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఉదయ్ మృతిచెందాడు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

చెరకు ట్రాక్టర్ బోల్తా


వాహనాలను దారి మళ్లిస్తున్న ఏఎస్సై ప్రసాద్

వంగర: మండల పరిధిలోని మగ్గూరు గ్రామం సమీపంలో మంగళవారం చెరకు ట్రాక్టర్ బోల్తా పడింది. భారీ లోడుతో సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో రాజాం, వంగర వైపు వెళ్లే వాహనదారులు అవస్థలు పడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు.

కారు ఢీకొని ఆవు మృతి

- నుజ్జునుజ్జయిన కారు


మృతి చెందిన ఆవు

బొండపల్లి: వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో జాతీయ రహదారి26ను దాటుతున్న ఆవు అక్కడిక్కడే మృతి చెందగా ఇదే ప్రమాదానికి కారణమైన కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. మంగళవారం వేకువజామున జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి గ్రామానికి సమీపంలో గల జాతీయ రహదారిపై ఆవు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన సంగతి తెలిసిన వెంటనే ఎస్సై మహేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు

సీతమ్మధార: విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన పూసరెడ్డి అప్పలస్వామి (68) గత నెల 26న నగరంలోని ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో భిక్షాటన చేస్తుండగా ఏయూటీడీ ప్రతినిధులు గమనించి షెల్టర్ హోమ్‌కు తరలించారు. ఆ వ్యక్తి చిరునామా తెలుసుకుని మంగళవారం భోగాపురం దగ్గరలో గల పెదసుబ్బవానిపాలెంలోని కొడుకు అప్పారావుకు అప్పగించారు. ఇల్లు, పొలం ఉండడంతో పాటు పెన్షన్ కూడా వస్తున్న అప్పలస్వామి మద్యపానానికి అలవాటు పడి విశాఖలో భిక్షాటన చేస్తుంటాడని, అతని భార్య మరణించిందని ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో కార్మికుడి మృతి


రమణ (ఫైల్)

మల్కాపురం (విశాఖ): డాక్‌యార్డు సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు అకస్మాత్తుగా మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా మంగళపాలెం వద్ద గల దేశపాత్రునిపాలెం ప్రాంతానికి చెందిన గొరపల్లి రమణ (35) హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో 15 ఏళ్ల నుంచి పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లి సంస్థలో గ్యాస్ సిలిండర్లను అన్‌లోడ్ చేస్తున్న సమయంలో రాత్రి పదిగంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే షీలానగర్ వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించేందుకు ప్రయత్నించగా..కుటుంబసభ్యులు, కార్మికులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. సోమవారం రాత్రి 12 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి ఆందోళన కొనసాగించారు. యాజమాన్యంతో కార్మిక సంఘాలు చర్చలు జరపగా యాజమాన్యం దిగొచ్చి మృతుని కుటుంబానికి రూ.14 లక్షల పరిహారం చెల్లిస్తామని అంగీకరించింది. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. మృతుడికి భార్య రమణమ్మ, దుర్గ, కల్యాణి అనే ఇద్దరు కుమార్తెలున్నారు.

కేన్సర్‌ను గుర్తించేందుకు ఇంటింటి సర్వే

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: కేన్సర్‌ను గుర్తించేందుకు ఇంటింట సర్వే చేస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. నోటి, రొమ్ము, సర్వేకల్, ఊపరితిత్తుల కేన్సర్‌లు ప్రమాదకరమైనవిగా పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కేన్సర్ రోగుల కోసం ప్రత్యేక విభాగంను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ మారుజాతర

- ఉదయం 10.30గంటల తరువాత పెరిగిన భక్తుల రద్దీ
- భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టిన సీఐ రామకృష్ణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఎస్సై వెంకటరమణ
- బస్సులు చాలక ఇబ్బందులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


అమ్మవారికి ఘటం చెల్లిస్తున్న భక్తుడు


శంబర పోలమాంబ అమ్మవారు


గోముఖి నది ఒడ్డున మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


క్యూలో భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం ఘనంగా జరిగింది. గతేడాది కంటే ఈఏడాది మారుజాతరకు భక్తుల రద్దీ తగ్గింది. రథసప్తమి పండగ సందర్భంగా భక్తులు తగ్గి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఉదయం తొలుత భక్తుల రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ, 10.30గంటల తరువాత ఒక్కసారిగా భక్తులు శంబర గ్రామానికి చేరుకోవడంతో దారులన్నీ రద్దీగా మారాయి. భక్తుల రద్దీ పెరగడంతో ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకృష్ణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఎస్సై వెంకటరమణ, ఉత్సవ కమిటీసభ్యులు దగ్గరుండి అమ్మదర్శనానికి భక్తులను తరలించారు.

అమ్మను దర్శించుకున్న భక్తులు

చదురుగుడి, వనంగుడిలో కొలువైన శంబరపోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. గోముఖినది ఒడ్డున తలనీలాలు సమర్పించి నదిలో స్నానాలు ఆచరించారు. కోళ్లు, మేకలు, చీరలు మొక్కుబడులుగా చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించారు. వనంగుడి వెనుకన ఉన్న వేపచెట్టుకు భక్తులు పూజలు చేశారు. అలాగే ప్రధానవీధిలోని సిరిమాను కర్రకు భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. చదురుగుడి వద్ద క్యూలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది.

బస్సులు చాలక అవస్థలు

పార్వతీపురం, బొబ్బిలి నుంచి శంబరకు వచ్చే ఆర్టీసీ బస్సులు చాలకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. ఒక్కో బస్సుకోసం 40నిమిషాల వరకు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని భక్తులు ఆవేదన వెలిబుచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అదే పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఆటోలు, ఇతరత్రా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి, వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

108 వాహనంలో గిరిజన మహిళ ప్రసవం

- ప్రసవం తర్వాత హుటాహుటిన ఘోషా ఆస్పత్రికి తరలింపు


ప్రసవించిన గిరిజన మహిళ, శిశువుతో 108 సిబ్బంది

బొండపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డోలీ మోతలు నివారించి గిరిజనులకు ఎటువంటి వైద్య సేవలకు అటంకం లేకుండా పక్కాగా సేవలు అందిస్తామని ఇచ్చిన హామీలు నీటిమూటలు గానే మిగిలాయి. గిరిజనులకు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడు నెలలు గడిచినా వారి వైద్య సేవల పట్ల ఎటువంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. దీనికి ఉదాహరణగా మంగళవారం సాయంత్రం జరిగిన సంఘటన నిలుస్తోంది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మెంటాడ మండలంలోని మిర్తివలస గిరిజన గ్రామానికి చెందిన పాడి గౌరమ్మకు రెండవ కాన్పు కాగా పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకువచ్చారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు ప్రథమ కాన్పు సిజేరియన్ చేయడం వల్ల రెండవ కాన్పు ఇక్కడ చేయడం కుదరదని వాహనంలోనే పరీక్షించి విజయనగరం తరలించాలని సూచించినట్లు 108 సిబ్బంది తెలిపారు. దీంతో అదే వాహనంలో ఆమెను విజయనగరం తీసుకువెళ్తుండగా గొట్లాం సమీప జాతీయ రహదారి 26 వద్దకు వచ్చేసరికి పురిటినొప్పులు తీవ్రం కావడంతో వాహనంలోనే ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత గౌరమ్మకు రక్తస్రావం ఎక్కువ కావడంతో విజయనగరంలోని ఘోషా ఆస్పత్రికి 108 సిబ్బంది తరలించారు. ఒక వైపు ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం, మరోవైపు గిరిజనుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. రెండు నిండు ప్రాణాలను కాపాడిన 108 సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

ముఖ్యవ్యక్తుల భద్రతలో అనుక్షణం అప్రమత్తం


ఫైరింగ్ ప్రాక్టీస్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో గల ఫైరింగ్ రేంజ్‌లో వివిధ ఆయుధాలను వినియోగిస్తూ ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే పీఎస్‌ఓల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య వ్యక్తుల భద్రతా విధుల నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రత విధుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం తగదని, ముఖ్య వ్యక్తులను కలిసేందుకు వచ్చే వ్యక్తులను నిత్యం నిశితంగా గమనించాలని చెప్పారు. ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే పీఎస్‌ఓలకు మూడురోజుల పాటు నిర్వహించిన రిఫ్రెషర్ కోర్సులో ముఖ్య వ్యక్తుల భద్రతకు వారు నిర్వహించే విధుల పట్ల, చేపట్టాల్సిన చర్యల పట్ల, శారీరకదారుఢ్యం మెరుగుపర్చుకోవడంలో శిక్షణ ఇచ్చామని ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఫైరింగ్ నిర్వహించి, వారి నైపుణ్యాన్ని ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఎస్పీ సీఐలు ఏవీ. లీలారావు, ఆర్‌వీఆర్ కే.చౌదరి, ఆర్‌ఐ సెక్యూరిటీ టి.శ్రీనివాసరావు, ఆర్ఎస్సై టి.రామారావు, ఆర్మర్, ఫైరింగ్ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

కలాసీల వేతన కష్టాలు

- ఫుడ్‌పార్క్ వద్ద ఆందోళన
- వేతన చెల్లింపుల్లో మోసమంటూ నిరసన
- గొడౌన్లకు వచ్చిన లారీల అడ్డగింత


ఫుడ్‌పార్క్‌లోకి లారీలు వెళ్లకుండా అడ్డుకుని నినాదాలు చేస్తున్న కలాసీలు

చీపురుపల్లి: ఉదయం విధులకు వచ్చినప్పటి నుంచి సాయంత్రం వరకు రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పని చేస్తుంటే మాకు రావాల్సిన వేతనం మాత్రం అరకొరగానే వస్తోంది. మా కష్టాన్ని ఫుడ్ పార్క్ యాజమాన్యం దోచుకుంటోంది.. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల పేరుతో కొల్లగొడుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న గొడౌన్లలో పని చేసే కలాసీలకు వచ్చే వేతనం కూడా మాకు రావడం లేదు. ఆ గొడౌన్లలో విధులు నిర్వహిస్తున్న కలాసీలకు మాకు తేడా ఏంటి? దాదాపు ఏడెనిమిది సంవత్సరాలుగా విధులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాల మంజూరులో వివక్ష జరుగుతోందంటూ చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస సమీపంలో గల ఫుడ్ పార్క్ వద్ద కలాసీలు ఆందోళనకు దిగారు. ఫుడ్‌పార్క్ యాజమాన్యం న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. వేతనాల విషయంలో తమకు అన్యాయం జరుగుతోందంటూ మంగళవారం నిరసనకు దిగిన కలాసీలు ఫుడ్‌పార్క్‌లోకి వస్తున్న బియ్యం, మొక్కజొన్న లారీలను అడ్డుకున్నారు. ఫుడ్‌పార్క్ ప్రధాన గేటు వద్ద రాస్తారోకో నిర్వహించి ఎలాంటి వాహనాలు లోపలికి పంపించకుండా దాదాపు 150 మంది కలాసీలు నిరసన తెలిపారు. దీంతో మండలంలోని పత్తికాయవలస సమీపంలో ఉన్న ఫుడ్ పార్క్ నుంచి శ్రీకాకుళం జిల్లాలోని వెంకటాపురం వరకు భారీఎత్తున లారీలు నిలిచిపోయాయి.

కలుషిత ఆహారంతో విద్యార్థినులకు అస్వస్థత

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స


సర్వజన ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న జశ్విని

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని సుంకరి వీధిలో ఉన్న ప్రభుత్వ సాంఘిక వసతి గృహానికి చెందిన విద్యార్థినులు కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకు గురై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వసతిగృహం విద్యార్థినులకు సోమవారం ఉదయం వాంతులు, విరోచనాలు అవడంతో సిబ్బంది 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వారికి తరలించారు. ముందు రోజు వసతిగృహంలో బిర్యానీ తిన్నామని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు తెలిపారు. అస్వస్థతకు గురైన వారిలో ఇద్దరు ఫీమేల్ వార్డులో చికిత్స పొందగా, ఒకరు ఐసీయులో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మరో ఇద్దరు విద్యార్థినులు కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలోని ఓపీ విభాగానికి వచ్చి చికిత్స తీసుకుని వెళ్లిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు తెలిపారు.

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

పార్వతీపురంటౌన్: ఈ నెల 19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్–ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు, హ్యాండ్లూమ్ వీవింగ్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీసీసీ ఫిబ్రవరి 2025 పరీక్షల టైమ్ టేబుల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓఈ.ఇన్ కార్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో చిన్నారికి స్వర్ణపతకం


చిన్నారిని అభినందిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన ఆరిక యాగ్నిక్ అనే ఆరేళ్ల చిన్నారికి అంతర్జాతీయ కరాటే పోటీల్లో స్వర్ణపతకం దక్కింది. ఇటీవల విశాఖపట్నంలోని పోర్టు స్టేడియంలో అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వంటి దేశాల క్రీడాకారులతో పోటీపడి మండలానికి చెందిన విద్యార్థి యాగ్నిక్ గోల్డ్‌మెడల్ సాధించడంతో ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలంటూ ప్రోత్సహించారు. కార్యక్రమంలో మాస్టర్ కోచ్ తోట సింహాచలం, కోచ్ ఆరిక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో గిరిపుత్రుల సత్తా


మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన గిరిజన క్రీడాకారులతో కోచ్ రామచంద్రరావు

శృంగవరపుకోట: జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన గిరిజన క్రీడాకారులు సత్తా చాటి పతకాల పంట పండించారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ కేరళ రాష్ట్రంలోని త్రిశూర్ జిల్లా కున్నంకులం గ్రామంలోని ప్రభుత్వ బాలుర హై సెకండరీ స్కూల్‌లో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా గిరిజన క్రీడాకారులు 3 స్వర్ణం, 7 రజతం, 9కాంస్య పతకాలు సాధించారని కోచ్ చాపా రామచంద్రరావు చెప్పారు. ఉద్యోగాలు లేక ఉపాధి కోసం వేర్వేరు వృత్తులు చేసుకుంటూ ఆటపై మక్కువతో వచ్చి పతకాలు పండిస్తున్న గిరిపుత్రులను ప్రభుత్వాలు, లేదా ప్రైవేట్ క్రీడా సంస్థలు ఆర్థికంగా ఆదుకుని, అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. 2004లో గిరిజన క్రీడాకారులు 45 పతకాలు సాధించి ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ 2వ స్థానం సాధించారని, 2000లో మహిళలు ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ సాధించారని వివరించారు. ఇటీవల జరిగిన పోటీల్లో పి.జయరాం 10కి.మీ పరుగులో రజతం, 1500మీ పరుగులో కాంస్యం, పి.కిశోర్ 5కి.మీ నడకలో స్వర్ణం, పి.కోటేశ్వరరావు పోల్‌వాల్ట్‌లో కాంస్యం, పి.దొరబాబు హైజంప్‌లో కాంస్యం, కె.రాంప్రసాద్ 5కి.మీ వాకింగ్‌లో వెండి. ఎం.శ్రీరాములు 5కి.మీ వాకింగ్‌లో కాంస్యం, కె.కన్నారావు లాంగ్ జంప్‌లో వెండి, హైజంప్‌లో కాంస్యం, 100మీ రన్‌లో కాంస్యం, ఎస్.చంద్రరావు 400మీ రిలేలో వెండి పతకం, 110మీ హర్డిల్స్‌లో కాంస్యం, కె.నరేష్ హర్డిల్స్‌లో కాంస్యం, కె.సోమునాథ్ 100మీలో కాంస్యం, పి.మంగళ్లు 200మీ లో వెండి పతకాలు సాధించారని కోచ్ వివరించారు.

డైమండ్ జూబ్లీ జంబోరీలో జిల్లా విద్యార్థుల ప్రతిభ


తిరుచరాపల్లిలో జంబోరి ముగింపు కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు, విద్యార్థులు

వేపాడ: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 సంవత్సరాల డైమండ్ జూబ్లీ జంబోరీలో పాల్గొన్న జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తాచాటారు. జిల్లానుంచి 50 మంది సభ్యులతో జిల్లా చీఫ్ కమిషనర్, జిల్లా జంబోరీ కంటిన్‌జెట్ లీడర్ బీపీఏ రాజు, వైస్ ప్రెసిడెంట్ నారాయణమూర్తి, గైడ్ క్యాప్టెన్ నయా మున్నీస్ తదితరులతో పాటు సోంపురం, లక్కిడాం, మొయిద, రెల్లివలస, కుమరాం, ఓపెన్ రోవర్ యూనిట్స్ నుంచి స్కౌట్స్ 39 మంది, 11 మంది గైడ్స్ పాల్గొన్నట్లు బీపీఏ రాజు తెలిపారు.

జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగిన కార్యక్రమంలో మన జిల్లా విద్యార్థులు పిజికల్ డిస్ప్లేలో ఎ గ్రేడ్, కాంప్‌ఫైర్, ఫుడ్ ప్లాజా, ఫోక్ డ్యాన్స్‌లలో బి గ్రేడ్, స్కిల్ ఓరామ పోటీలో సి గ్రేడ్ వచ్చినట్లు చెప్పారు. తమిళనాడులోని తిరుచరాపల్లిలో జరిగిన ముగింపు కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రితో పాటు దేశ విదేశాల ప్రతినిధులు పాల్గొన్న కార్యక్రమంలో తామంతా భాగస్వామ్యం కావడం అనందంగా ఉందన్నారు.

రేగిడి జెడ్‌పీహెచ్‌ఎస్‌కు జాతీయస్థాయి గ్రీన్‌స్కూల్ అవార్డు

- ఢిల్లీలో బహుమతి ప్రదానం


ఢిల్లీలో సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీతా నరైన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సైన్స్ ఉపాధ్యాయిని ఉమామహేశ్వరి

రేగిడి: విజయనగరం జిల్లా రేగిడి మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ స్థాయి గ్రీన్ స్కూల్ అవార్డును అందుకుంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఢిల్లీ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్‌కు రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైన విషయం పాఠకులకు విదితమే. దేశవ్యాప్తంగా కేవలం 5 శాతం స్కూల్స్ మాత్రమే పర్యావరణ హిత కార్యక్రమం ద్వారా ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. అందులో భాగంగా మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్ సునీతా నరేన్ చేతుల మీదుగా రేగిడి పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని, గ్రీన్ టీచర్ బూరవిల్లి ఉమామహేశ్వరి ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయరాలిని ఏపీఎస్ జీసీ డైరెక్టర్ పి.స్రవంతి, ఎస్‌టీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.నీలకంఠయ్య, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, ఉప విద్యాశాఖాధికారి మోహనరావు, కేవీ రమణ, జిల్లా ఎస్‌టీసీ కోఆర్డినేటర్ బూరి వేణుగోపాలరావు, ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, పాఠశాల హెచ్‌ఎం వావిలపల్లి లక్ష్మణరావులు అభినందించారు.

గుర్లలో మృత్యుఘోష


గుర్ల గ్రామం

- ఒకే రోజు ముగ్గురు మృతి
- గ్రామస్తుల్లో భయాందోళన
- ఇప్పటికే వాంతులు, విరేచనాలతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు
- చంపావతి నది నీటి సరఫరాపై స్థానికుల్లో అనుమానాలు
- కొద్దికాలం కిందటే డయేరియాతో 14 మంది మృతి

చీపురుపల్లి/గుర్ల: ఒకరి తర్వాత ఒకరు... చితి ఆరకముందే శ్మశానానికి మరొకరి మృతదేహం.. ఇలా ఒకే రోజు ముగ్గురు చనిపోవడంతో గుర్లలో మంగళవారం మృత్యుఘోష వినిపించింది. మొన్నీమధ్యనే గుర్లతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 14 మందిని డయేరియా పొట్టన పెట్టుకుంది. ఆ భయం ఇప్పటికీ గ్రామస్తులను వీడడం లేదు. తాజాగా గ్రామస్తుల్లోని పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో.. మళ్లీ డయేరియా ప్రబలిందా?.. బాబోయ్... ఇదేం బాధరా బాబూ అంటూ గుర్ల మండల కేంద్ర ప్రజలు కలవరపడుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నంలోగా డయేరియాతో సంబంధం లేకపోయినప్పటికీ గుర్లకు చెందిన రేగాన గురినాయుడు(70), షేక్‌ఫాతిమా (80), గుమ్మడి అప్పన్న (65) మరణించడం స్థానికంగా భయాందోళనలు రేకెత్తిస్తోంది. ఉదయాన్నే కనిపించిన డయేరియా లక్షణాలు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందగానే సాయంత్రానికల్లా తగ్గుముఖం పడుతున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. పెద్దలతో పాటు పాఠశాలలకు వెళ్లే పిల్లలు సైతం కడుపు నొప్పితో పాటు విరేచనాలు సమస్య ఎదుర్కొంటుండడంతో స్థానికంగా భయాందోళనలు చెలరేగుతున్నాయి. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సైతం గుర్లను సందర్శించి వైద్యసేవలు అందిస్తున్నా.. డయేరియా లక్షణాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వెనుక కారణాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తోంది.

భయానక వాతావరణం....

ఓ వైపు వాంతులు, విరేచనాలతో పదుల సంఖ్యలో ఆస్పత్రులకు వెళ్తున్న నేపథ్యంలో ఒకే రోజు అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన ఘటన గ్రామస్తులను కలవరపెడుతోంది. మృతుల్లో రేగాన గురినాయుడు గుండెపోటుతో ఆస్పత్రిలో మృతిచెందగా, షేక్ ఫాతిమా, గుమ్మడి అప్పన్న ఇంటివద్దనే ఉంటూ ఆకస్మికంగా చనిపోయారు. ఆ ముగ్గురు డయేరియా లక్షణాలతో సంబంధం లేకుండా మృతి చెందారని కుటుంబ సభ్యులు చెబుతున్నా... గ్రామంలోని ప్రస్తుత పరిస్థితిని చూసిన స్థానికులు భయంతోనే కాలం వెళ్లదీస్తున్నారు.

చంపావతి నీరే కారణమా...

గతేడాది అక్టోబర్, నవంబర్ నెలలో ప్రబలిన డయేరియాకు చంపావతి నుంచి సరఫరా జరుగుతున్న తాగునీరే కారణమని అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, కలెక్టర్ ప్రకటించిన విషయం విదితమే. చంపావతి నదిలో కళేబరాలు కొట్టుకురావడంతో నీరు కలుషితమైందని, దీంతోనే డయేరియా ప్రబలిందని చెప్పినప్పటికీ తరువాత కాలంలో ఆ ప్రకటనలో మార్పు వచ్చిన సంగతి తెలిసిందే. చంపావతి నీటి సరఫరాను నిలిపివేశారు. తిరిగి డిసెంబర్ నెలాఖరు నుంచి చంపావతి నీటి సరఫరాను గుర్లకు పునరుద్ధరించారని, అక్కడి నుంచి కలుషిత నీరు వస్తుండడంతోనే మళ్లీ డయేరియా పునఃప్రారంభమవుతోందనే చర్చ స్థానికంగా జరుగుతోంది.

అవి సహజమరణాలు..

రేగాన గురినాయుడు గుండెపోటుతో మరణించగా, మిగిలిన ఇద్దరు వృద్ధాప్యంతో మృతిచెందారు. డయేరియా వ్యాధి ఎవరికీ నిర్ధారణ కాలేదు. గ్రామస్తులు ఆందోళన చెందవద్దు. ఇంటింటి సర్వే చేశాం. అవసరమైన వారికి వైద్యసేవలు అందిస్తున్నాం.

– చిన్నయ్య, గుర్లపీహెచ్‌సీ వైద్యాధికారి